# అతనిలో అతను

కేశిరాజు ఫణి ప్రసాద్


"నాకు ట్రాన్స్‌ఫర్ అవడంతో త్వరలో వచ్చేస్తున్నాను." ఆరోజు పోస్ట్ చూస్తున్న నేను ఉలిక్కిపడ్డాను! ఈ ఉత్తరం ఎవరు రాశారో ఎక్కడి నుంచి రాశారో తెలిసినా వెనక ఫ్రమ్ అడ్రస్ చూశాను.



కరెక్ట్! రామకృష్ణ రాసిన ఉత్తరం! పేపరులో హెడ్ లైన్ లాగా అసలు విషయాన్ని తన ఉత్తరంలో మొదటి వాక్యంగా రాశాడు! అలా రామకృష్ణ రాయడం "నేను అనుకున్నది తప్పకుండా టైమ్‌కి సాధించగలను"అనే సమర్థతకు ముఖ్యంగా పట్టుదలకు ఉదాహరణ!

రామకృష్ణ రెండు సంవత్సరాల క్రితం ఇక్కడే పని చేశాడు. రామకృష్ణకి ఆఫీసులో ఎంతో గుర్తింపు వుంది! స్వతహాగా తెలివైనవాడు. "పీకలు ముంచే సమస్యలు కూడా ఎంతో తేలికగా పరిష్కరించి, ఆఫీసర్ల మెప్పు పొందిన వ్యక్తి! ఆఫీసులో రామకృష్ణకి తెలియని విషయం వుండదు!

అలాగని రామకృష్ణ అన్ని విషయాలలో తల దూర్చడు. తన సెక్షన్ పని టైముకి పూర్తిచేయడం, వెంటనే మరో పని గురించి ఆలోచించడం, ఇటువంటి లక్షణాలు వున్నవాడు! అతనిలో లోపాలు వెతకాలనుకోవడం ఒట్టి తెలివితక్కువతనం అని అక్షరాలా నిరూపించిన మనిషి. రామకృష్ణ తోటి ఉద్యోగస్తుడిగా నేను చేశాను! అతని సెక్షన్‌లోనే నన్ను కూడా వేశారు. ఒక వారం రోజుల వరకూ నాకంటూ స్వయంగా పని కల్పించలేదు. మేము పనిచేస్తున్న డిపార్ట్‌మెంటు రూల్స్ పుస్తకాలు, వాటి అవసరాల గురించి క్లుప్తంగా చెప్పి నన్ను చదివి అర్థం చేసుకోమన్నాడు. మామూలుగా చదవడం కాదు! మనసు పెట్టి చదివి ముఖ్యమైన విషయాలు ప్రత్యేకంగా రాసి వుంచుకోమ్మని మరీ చెప్పాడు!




"ఇతను రూల్స్ పాటించే మనిషి" రామకృష్ణంటే నాలో కలిగిన అభిప్రాయం.

"వెరీగుడ్ శ్రీరామ్! మీరు డ్రాఫ్టింగ్‌కి ఉపయోగించిన వాక్యాలు చాలా బాగున్నాయి! అంతేకాదు మీకు ఇంగ్లీషు మీద మంచి కమాండ్ వుంది"

నన్ను మనస్ఫూర్తిగా అభినందించిన అపురూపమైన క్షణం. వారు మిగిల్చిపోయిన ఒక తియ్యటి జ్ఞాపకం! ప్రస్తుతం ఆ అనుభూతిని నా హృదయాన్ని సున్నితంగా స్పర్శిస్తోంది. అది కేవలం క్షణికం.

మనం చేసింది తప్పని తెలిసినా మనతో పాటు మరొకరు కూడా తప్పు చేశారనుకోవడం సహజం. అంతేకాని తప్పు చెయ్యకుండా వుండాలనే ఇంగిత జ్ఞానం రమ్మన్నా రాదు. నేర్చుకుందామనుకోవడానికి అహం అడ్డుపడుతుంది. రామకృష్ణకి ఎటువంటి పరిస్థితిలో ట్రాన్స్‌ఫర్ అయిందో జ్ఞాపకాల తెరలేస్తోంది.

***

మధ్యాహ్నం రెండు గంటలు! రామకృష్ణ, నేను, లంచ్ అయ్యాక సెక్షన్‌కొచ్చి కూర్చున్నాం.

ఫోన్ మోగింది. తియ్యాలా, వద్దా అనుకుంటూ రామకృష్ణని చూశాను. టెలిఫోన్ మోగుతోందన్న సంగతి గమనించకుండా నోట్ ప్రిపేర్ చేస్తున్నాడు. టెలిఫోన్ ఆగకుండా మోగుతోంది.

"హలో..." అన్నాను.

"రామకృష్ణ వున్నాడా?" అటువైపు నుంచి ఎవరో అడుగుతున్నారు.

"ఒక్క నిమిషం" అంటూ రామకృష్ణకి ఫోన్ అందివ్వబోయాను.

"ఇప్పుడు వీలుపడదు. తరువాత ఫోన్ చెయ్యమను"

రామకృష్ణ చెప్పింది ఫోన్‌లో అవతల వైపు వున్న వారికి చెప్పాను.

"మీరు మరోలా అనుకోకపోతే దయచేసి రామానికి ఫోన్ ఇవ్వండి. నేనెవరో తెలిస్తే, వెంటనే మాట్లాడతాడు"

అవతలి వ్యక్తి మాటల్లోని చనువుని అర్థం చేసుకొని నేను రామకృష్ణ చేతికి రిసీవరిచ్చాను.

తప్పని సరిగా ఫోన్ అందుకొని "హలో నేను రామకృష్ణని...." ఫోన్‌లో మాట్లాడుతూ, అంత వరకూ చేతిలో వున్న పెన్ జేబులో పెట్టుకుంటూ సీట్లో వెనక్కివాలి మాట్లాడడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

ఎవరితోనూ ఫోన్‌లో ఎక్కువ సేపు మాట్లాడడు. పనిలో మునిగిపోతే అసలు మాట్లాడడు. మరిప్పుడు ఇదేమిటి? ఎంతో హుషారుగా మాట్లాడుతున్నాడు. అనుకుంటూ అతని వైపే చూస్తున్నాను.

ఇంకా అలాగే మాట్లాడుతుంటే కుర్చీలోంచి లేవబోయాను. కానీ నన్ను వెళ్లవద్దని సైగ చేశాడు. సీట్లో కూర్చుండిపోయాను.

"ఫోన్ చేసిన వాళ్లు రామకృష్ణకి బాగా దగ్గరవాళ్లయ్యుండాలి" అతను మాట్లాడేది ఫోన్‌లోనే అయినా ఎదురెదురుగా వున్నట్లు మాట్లాడుతున్నాడు. పైగా అతని మాటల్లో సంతోషం చెప్పలేనంతగా వ్యక్తమవుతోంది.

"ఇన్నేళ్లయినా నువ్విలా ప్రత్యేకంగా ఫోన్ చేశావంటే ఓహ్! ఎలా చెప్పాలో తెలియడం లేదు. మనిద్దరం కలిసి పనిచేసే అవకాశం ఇలా అనుకోకుండా రావడం నిజంగా..." ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. అనుకోకుండా కలిగిన ఉత్సాహం వలన మధ్యలో మాట తడబడుతోంది.

"ష్యూర్...తప్పకుండా కారు పంపించమంటావా... వీలుపడదు... నిన్ను రిసీవ్ చేసుకోవడానికి స్వయంగా నేనే వస్తాను!నీతో మాట్లాడుతుంటే నిన్ను ఎప్పుడెప్పుడు చూస్తానా అనే ఆరాటంలో వుంటే..." ఓకే... ఫోన్‌లో మాట్లాడడం పూర్తి అయ్యాక నన్ను చూశాడు. మనసుని ఆవరించిన సంతోషం కళ్లల్లో మెరుస్తోంది.

"చూడు ఇప్పుడు ఫోన్ చేసిందెవరో తెలుసా? మా స్నేహ"

అర్థం కానట్టుగా రామకృష్ణని చూస్తున్నాను.

"అయాం సారీ..స్నేహ అంటే నీకు తెలియదు కదా."అని తనకీ స్నేహకు వున్న అనుబంధం ఎటువంటిదో, ఎన్నాళ్లదో ఎంతో తన్మయత్వంతో చెప్పాడు.

స్నేహం జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. రామకృష్ణ మాటలు ఆసక్తిగా విన్నాను. ఆ కంఠంలో ఏదో తెలియని ఆనందం.

ఆ రోజు... ఇప్పటికీ కళ్లలో కదులుతూనే వుంది. ఉదయం పదిగంటలు. రామకృష్ణ స్నేహని తీసుకొని ఆఫీసుకొచ్చాడు. ఆఫీసులో అన్ని సెక్షన్లు స్వయంగా చూపించాడు.

ఆ తరువాత మా సెక్షన్‌కి రాగానే "హలో శ్రీరామ్" అంటూ పలకరింపు అని అతని సీటు దగ్గరకి వెళ్లాను. "ఈ అమ్మాయి స్నేహ. నిన్న చెప్పానుగా స్నేహా ఇతను శ్రీరామ్. మనకి ఎంతో కావలసినవాడు". నన్ను పరిచయం చేయగానే ఒకరినొకరం పలకరించుకున్నాం.

క్యాంటిన్ నుంచి కాఫీ తెప్పించాను.

"శ్రీరామ్ స్నేహ కూడా మన సెక్షన్‌లోనే పనిచేస్తుంది. ఎంతోకాలంగా మన డిపార్ట్‌మెంట్‌లో టెంపరరీగా పనిచేశాక ఇన్నాళ్లకు రెగ్యులర్ చేసి మన ఆఫీసుకి పోస్ట్ చేశారు." స్నేహ మీద సానుభూతి వ్యక్తమవుతోంది మాటల్లో.

స్నేహని పరిశీలనగా చూశాను. మధ్య తరగతి అమ్మాయి. రామకృష్ణలో కలిగిన సానుభూతి అర్థమయింది.

కొంచెం సేపయ్యాక స్నేహ కోసం మా సెక్షన్‌లో సీటుకూడా ఏర్పాటయ్యింది. రామకృష్ణ తన దగ్గరుంచుకున్న డిపార్ట్‌మెంట్ రూల్స్ పుస్తకాలు స్నేహకిస్తూ వాటిల్లో వున్న ముఖ్యమైన విషయాలు ఎంతో శ్రద్ధగా వివరించి మరీ చెప్పాడు. అవన్నీ ఒక పుస్తకంలో రాసుంది.

డిపార్ట్‌మెంట్‌లో ప్రతి ఒక్కరూ చురుకుగా పనిచేయాలి. ఫలితంగా ఉద్యోగులుగా మనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు కలుగుతుంది. తన సహ ఉద్యోగులలో కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఆఫీసరుగా

రామకృష్ణ తోటి ఉద్యోగస్థులకు ఆఫీసు వ్యవహారాలలో సహాయపడుతుంటాడు.

ఇటువంటి స్వభావం వున్న ఆఫీసర్లు ఎంత మంది? ప్రశంసాపూర్వకంగా చూశాను. రామకృష్ణ తన పనిలో సీరియస్‌గా నిమగ్నమైపోయాడు. మరో ఆలోచన లేకుండా నేను, స్నేహ కూడా పని చేసుకుంటున్నాం. సాయంత్రం అయింది. అయినా ఆరోజు వర్క్ పూర్తికాలేదు. అలాగని మరుసటి రోజుకి వాయిదా వేయకూడదు. అది మనకి ఇబ్బంది. పని రెట్టింపు అవుతుంది. రామకృష్ణ సహచర్యంలో నేను నేర్చుకొని కచ్చితంగా పాటిస్తున్నాను.

''చూడు స్నేహ, ఇవ్వాల్టికి నువ్వు ఇంటికి వెళ్లిపో. మా ఆవిడ అంకితకి పొద్దున్నే చెప్పాను. నిన్ను బజారుకి తీసుకెళ్లమని. ఇద్దరూ కలిసి షాపింగుకి వెళ్లండి.''

ట్రాన్స్‌పోర్టు సెక్షన్‌కి ముందే చెప్పినట్లున్నాడు. స్నేహ ఆఫీసు కారులో వెళ్లిపోయింది. స్నేహకోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడు. నాలో నేను అనుకున్నాను.

మళ్లీ మా పని చేసుకుంటున్నాం. ఇద్దరం కలిసి పని పూర్తి చేశాం. విశ్రాంతిగా సీటులో వెనక్కి వాలాడు. అన్నట్టు శ్రీరామ్ స్నేహకి ఒక మంచి ఇల్లు చూసిపెట్టాలి. వాళ్లమ్మగారితో కలిసి వుంటుంది. అంతవరకూ స్నేహ మా ఇంట్లోనే వుంటుంది. స్నేహ అంటే తనకి కూడా అభిమానం. నీలో కూడా వుండాలనే అభిప్రాయాన్ని సూచిస్తున్నట్లుగా మాట్లాడాడు.

ఈ ఒక్కరోజులోనే రామకృష్ణకి స్నేహ ఎంతో కావలసిన మనిషి అన్న విషయం పూర్తిగా అర్థం చేసుకున్నాను.

ఆడవాళ్లని గౌరవించడం సంస్కారం. రామకృష్ణ వ్యక్తిత్వంపై నాకు గౌరవ భావం. ప్రతి మనిషిలోనూ ప్రతిభ వుంటుంది. అంతర్లీనంగా వున్న ప్రతిభను గుర్తించి తగిన ప్రోత్సాహం ఇచ్చే వాళ్లుంటారు.


మా కొలీగ్ స్నేహ విషయంలో కూడా అదే జరిగింది. ఆఫీసులో చేరిన కొత్తలో ఎవరికీ తెలియని సాధారణ ఉద్యోగిని. కానీ ఆ అమ్మాయి పనితీరు, ప్రవర్తన, ఆఫీసులో అందరి మన్ననలను పొందగలిగింది. అందుకు రామకృష్ణ ఆమె విషయంలో తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ. ఆఫీసులో దగ్గరుండి మరీ స్నేహ చేత పని చేయించి వర్కు పెండింగ్‌లో వుండకుండా జాగ్రత్తపడడం వల్ల ప్రతి రోజూ ఏదో ఒక కొత్త పని చేయడం అలవాటయింది. ఆఫీసు వ్యవహారాలలో సమస్య వస్తే అది రామకృష్ణ పరిష్కరించేవాడు. స్నేహ తెచ్చుకున్న గుర్తింపు తెలిసిన మిగతా ఉద్యోగులు కూడా కొన్నాళ్లయినా మా సెక్షన్‌లో పనిచేయాలని అనుకోవడం కూడా నేను విన్నాను.

ఇవన్నీ చూస్తున్న నాలో ఒకే ఒక ఆలోచన చోటు చేసుకుంది. ఆఫీసులో ఎంతో మంది పనిచేస్తున్నారు. వీరెవరినీ పట్టించుకోని రామకృష్ణ ఒక్క స్నేహకే ఇంత ప్రోత్సాహం ఎందుకిస్తున్నట్లు?

ఒకరోజు అనుకోకుండా నా ఆలోచనకు కారణం తెలిసింది. సాయంత్రం నాలుగు గంటలకి హెడ్డాఫీసు నుంచి ఫ్యాక్స్ వచ్చింది. ఆ సమయంలో ఆఫీసులో స్నేహ లేదు.

''శ్రీరామ్ ఒక గుడ్‌న్యూస్'' అని పిలవగానే రామకృష్ణ దగ్గరికెళ్లాను. ''మన స్నేహకు ఒకేసారి రెండు ఇంక్రిమెంట్లు ఇచ్చారు'' అంటూ కాగితం చూపించాడు. డిపార్ట్‌మెంటు నిర్వహించిన హిందీ పరీక్షలు మెరిట్‌లో పాసయినందుకు అభినందిస్తూ రెండు ఇంక్రిమెంట్లు చూడగానే అనుకోకుండా నాలో రగిలిన అసూయ.

అందుకే ఏమి మాట్లాడకుండా ఉండి పోయాను. నా తరువాత ఆఫీసులో చేరిన ఒక జూనియర్, పైగా ఆడపిల్లకి నాకంటే జీతం ఎక్కువ.




ఈర్ష్య నా మనసుని కుదిపేస్తోంది. ఒక్క క్షణం రామకృష్ణని చూశాను. అతని కళ్లల్లో నీళ్లు. ఎందుకు? అనుకుంటుంటే ''శ్రీరామ్ ఇవ్వాళ నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి. స్నేహకి వాళ్లమ్మగారు తప్ప మరెవ్వరూ లేరు. హటాత్తుగా తండ్రి పోవడంతో చదువు మానేసి కుటుంబాన్ని పోషించవలసిన పరిస్థితి. తెలిసిన వాళ్ల మాట సహాయం వల్ల టెంపరరీగా మన ఆఫీసులో చేరింది. ఆ అమ్మాయిని చూసిన క్షణంలోనే ఆమె నా చెల్లెలు అనే భావన కలిగింది. నాకు చేతనయినంత వరకూ స్నేహకు సహాయం చెయ్యాలని నిర్ణయించుకున్నాను. మన ఆఫీసులో పోస్టింగు వచ్చాక. పుస్తకాలు, నోట్సులు ఇచ్చి హిందీ పరీక్షలు రాయించాను. పట్టుదల గల పిల్ల శ్రద్ధగా చదివి మెరిట్‌లో పాసయింది. స్నేహ నాకు అపురూపమైన చెల్లెలు. ఈ రోజు జీతం పెరిగింది. ఆ అమ్మాయికి కాదు నాకేనన్న సంతోషం. నా మనసుకి ఈ తృప్తి చాలు.'' చెమ్మగిల్లిన కళ్లతో మాట్లాడిన రామకృష్ణను చూస్తుంటే క్షణం క్రితం నా మనస్తత్వానికి నన్ను నేనే ఏవగించుకున్నాను.

సంస్కారంతో ఆలోచించాలి. ఔన్నత్యం అంటే ఇదే. వివేకం చేస్తున్న హెచ్చరిక.

ఆ వేళ స్నేహ ఆఫీసుకొచ్చింది. కానీ ఉత్సాహంగా లేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. పరిశీలనగా చూశాను. దిగులుగా కనిపించింది. ఎందుకని అడిగాను.

ఆఫీసు రూల్స్ పుస్తకం పోయింది. నిన్న సాయంకాలం బస్సు ఎక్కుతుండగా ఆ హడావుడిలో ఎక్కడో పడిపోయింది.

''అదేమిటి? రోజూ మిమ్మల్ని రామకృష్ణ మోటారుసైకిల్ మీద ఇంటి దగ్గర దింపుతారుగా'' వెంటనే అడిగాను.

''నిజమే కానీ ఈ మధ్య నేను బస్సులో వెడుతున్నాను''

అని చెప్పగానే ఎందుకని? అని అడుగుదామనుకొని మళ్లీ మానేసాను.

ఇప్పుడు పోయిన పుస్తకం ఎంతో ముఖ్యమైనది. పైగా రామకృష్ణ ప్రతిరోజూ రిఫరెన్సు కోసం వాడుతుంటాడు. ఈ విషయం తెలిస్తే.... ఊహించుకోలేకపోయాను.

స్నేహ మొహంలో భయం. అప్పటికి రామకృష్ణ ఆఫీసుకి రాలేదు. ఏ క్షణంలో వచ్చినా రావచ్చు. స్నేహ బెదిరిపోతూ అటూ ఇటూ చూడసాగింది. మరి కాసేపటికి రామకృష్ణ వచ్చాడు. నాలో కూడా ఎందుకో భయం. జరిగింది అతనితో చెప్పడమే మంచిది. ఆ తరువాత జరిగేదేదో జరుగుతుంది.

ఇదే ఆలోచనతో స్నేహకు సైగ చేశాను. వెంటనే లేచి వెళ్లింది. రామకృష్ణతో విషయం ఎంతో భయపడుతూ చెప్పింది. స్నేహని ఒక్క క్షణం సూటిగా చూశాడు. పరిస్థితి మరింత అయోమయం.

''వెళ్లి పనిచూసుకో'' సీరియస్‌గా చెప్పాడు. నాతో కూడా మాట్లాడలేదు. ఇబ్బందికరమైన పరిస్థితి. ఆ పుస్తకం దొరకడం కూడా కష్టం. చటుక్కున జ్ఞాపకమొచ్చింది. కొంచెం సేపయ్యాక రామకృష్ణ బయటకి వెళ్లాడు. ఎంతకీ రాలేదు. ఎక్కడున్నాడో కూడా తెలియదు. ఎవరినైనా అడుగుదామంటే మా ఇద్దరికీ ధైర్యం చాలడం లేదు. ఆఫీసు టైం అయిపోయింది. పుట్టెడు దిగులుతో స్నేహ ఇంటికి వెళ్లిపోయింది. నేను మాత్రం ఏదో పనిచేసుకుంటూ ఆఫీసులోనే వుండిపోయాను.

రాత్రి ఎనిమిది గంటల తరువాత వచ్చాడు రామకృష్ణ. సీట్లో కూర్చుని విశ్రాంతి కోసం వెనక్కి వాలాడు. చేతిలో వున్న కవరు టేబుల్ మీద పెట్టాడు. అనుకోకుండా అతని సీటు దగ్గరకెళ్లాను. కవరులోంచి ఏదో పుస్తకం తెరిచాడు. స్నేహ పోగొట్టుకున్న పుస్తకం. ఆశ్చర్యంతో చూస్తున్నాను. వెంటనే నా



## అమితాబ్ సినిమాలంటే...

అతను క్రికెట్ ఆడడు క్రికెట్‌తో మాట్లాడతాడు. మాట్లాడితే చాలు స్పెషల్ యాక్సెంట్‌లో ఆకర్షణ. హర్షాభోగ్లే గురించి తెలియనిదెవరికి చెప్పండి. హర్షా సంగతులు కొన్ని చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంటాయి.

★ చిన్నప్పుడు క్రికెట్ అంటే తెలియదు. ఎప్పుడూ హాకీ ఆటపై ఆసక్తి వుండేది. అప్పుడప్పుడు ఫుట్‌బాల్ కూడా ఆడుతూంటాను.

★ టీషర్ట్ లంటే బాగా ఇష్టం. ఇంట్లో కూడా టీషర్ట్‌లే వేసుకుంటాను. లేత రంగుల్లో వున్నవి బాగుంటాయి.

★ లవ్ మేరేజీ చేసుకున్నాను. భార్య పేరు అనిత. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్‌లో ఆ అమ్మాయి క్లాస్‌మేట్.

★ ఇద్దరు పిల్లలు. వీలు చిక్కినప్పుడల్లా వాళ్లతో ఆడుకోవాలని ఆశపడుతూ వుంటాను.

★ అమితాబ్ సినిమాలను చూడ్డమంటే తెగ ఇష్టం. షోలె లాంటి సినిమాను ఎన్నిసార్లు చూశానో. షారూఖ్ సినిమాలన్నా ఇంట్రెస్టే.

★ క్రికెట్‌లోనే కాదు ఇప్పుడు ఫుట్‌బాల్, హాకీ మ్యాచ్‌లకు కూడా కామెంటేటర్‌గా పనిచేస్తున్నాను.

★ మనదేశంలో రేడియోకు అంత ప్రాధాన్యం లేదు గానీ, ఆస్ట్రేలియా ఇంగ్లండ్‌లలో రేడియోకు బాగా అభిమానులున్నారు. ఒకసారి ఆస్ట్రేలియన్ రేడియోకు ప్రోగ్రామ్ ఇచ్చాను కూడా.

★ ఎప్పుడూ హ్యాపీగా వుంటూ, జీవితాన్ని ఎంజాయ్ చేయాలన్నదే నా అభిప్రాయం.

మనసు స్థిమితపడింది. ఎక్కడెక్కడో తిరిగి అదే పుస్తకం కొని పట్టుకొచ్చాడు.

''స్నేహ రోజంతా భయపడుతూనే వుంది. మధ్యాహ్నం లంచ్ కూడా చెయ్యలేదు.'' మెల్లగా ఆ అమ్మాయి పరిస్థితి వివరించాను. రామకృష్ణ మాట్లాడకుండా వుండిపోయాడు.

''స్నేహ చేసింది తప్పే. పొరపాట్లు జరుగుతుంటాయి. అటువంటప్పుడే ఓర్పు అవసరం. సాయం చేసి ఆదుకోవాలి. ఎందుకంటే మన అమ్మాయి'' రెప్పల చివర నుంచి చూస్తూ నాతో అన్నాడు. ఊహించని పరిస్థితి.

అతని స్థానంలో మరొక ఆఫీసరు వుండి వుంటే స్నేహ మీద పెద్ద కంప్లయింట్‌ని పంపించి వుండే వారు. ఆపైన ఊహించడానికి మనసొప్పలేదు.

అభిమానం వున్న చోట బాధ్యత తప్పదు. అర్థం చేసుకుంటున్న నాలో ఆలోచన. ఎంత హుందాగా ప్రవర్తించాడు. మెచ్చుకుంటోంది నా హృదయం. ఎంతో ఉత్సాహంగా ఆఫీసుకొచ్చాను. పాపం నిన్నటి రోజంతా భయంతోనూ, బాధతోనూ గడిపింది. రామకృష్ణ చేసిన సహాయం తెలిస్తే ఎంత సంతోషిస్తుందో. అనుకుంటూ సెక్షన్‌లోకి వచ్చాను.

మాటలు వినిపించడంతో లోపలికెళ్లకుండా నిలబడిపోయాను.

''స్నేహా... నువ్విలా అనుకుంటావని నీ మనసు తెలిసిన వాడిగా ఎప్పుడూ ఊహించలేదు'' రామకృష్ణ కంఠం వినిపించింది.

''కరెక్ట్ నువ్వు కూడా ఇలా చేస్తావని నేనూ అనుకోలేదు.'' స్నేహ నిష్ఠూరంగా మాట్లాడుతోంది.

ఇవ్వాళ వీళ్లు ముందుగానే వచ్చినట్టున్నారు. కానీ వీళ్లు మాట్లాడుకుంటున్నది ఏ విషయం? అర్థం కావడం లేదు.

''అంటే నేను చేసింది తప్పనే అనుకుంటున్నావా?'' రామకృష్ణ మాటలు వింటుంటే అతని మనసు బాధపడుతోందనిపించింది. ఎందుకు? తెలియని పరిస్థితి.

''అది నువ్వే తెలుసుకోవాలి. నా మనసులో మాట చెప్పాను'' స్నేహ నిర్మొహమాటం స్పష్టమవుతుండడంతో లోపలకి అడుగుపెట్టాను.

రామకృష్ణ వచ్చి సీట్లో కూర్చున్నాడు. మనిషి సీరియస్‌గా వున్నాడు. సరాసరి స్నేహ దగ్గరకెళ్లి ఎదురుగా కూర్చున్నాను. ''స్నేహా... నిన్న సాయంత్రం ఏం జరిగిందంటే...''

''శ్రీరామ్''

రామకృష్ణ పిలుపుకి మాట్లాడడం ఆపేశాను. ''అర్థం చేసుకునే వాళ్లకి వివరంగా చెప్పడం అనవసరం'' అతని మాటలకు ఇక ఏం మాట్లాడాలో తెలియక స్నేహ వైపు చూశాను. ఉలుకు పలుకు లేకుండా కూర్చుంది.

ఒక్క క్షణం లేచి ఇద్దరినీ గమనించాను. మాట పట్టింపు వచ్చినట్టుగా కనపడ్డారు. అయినా వాళ్ల మధ్య ఇటువంటివి వస్తుంటాయి పోతుంటాయి. నాకు నేనే సర్దిచెప్పుకున్నాను. రోజులు గడుస్తున్నాయి. ఇద్దరి మధ్య దూరం పెరుగుతోంది. ఒకరోజు మా ఎండిగారి ప్యూన్ వచ్చి ఆఫీసు నోటిచ్చాడు. విషయమేంటో అని అందుకుంటూ చదివాను. ''ఈ రోజు నుంచి స్నేహని వేరొక సెక్షన్‌కి మార్చారు'' జరగరానిది ఏదో జరిగినట్టుగా బాధపడుతూ రామకృష్ణని చూశాను.

'ఈవిధంగా ఒక ఆడపిల్ల మీద కక్ష సాధించడానికి మనసెలా ఒప్పిందో' ఆ క్షణంలోనే నాలో కసి రగులుకుంది. వెంటనే స్నేహ పనిమానేసింది. సెక్షన్ తాలూకు బీరువా తాళాలు రామకృష్ణ టేబుల్ మీద పెట్టి వెళ్లిపోయింది. ఏం పట్టించుకోకుండా కూర్చున్నాడు రామకృష్ణ.

ఈ అమ్మాయి మా ఆఫీసులో చేరినప్పుడు రామకృష్ణలో సంతోషం. ప్రతిరోజూ స్వయంగా ఇంటి దగ్గర దిగపెట్టిన అభిమానం. స్నేహ పుట్టినరోజు నాడు చీర కొనిపెట్టి ఒక తోబుట్టువులా ఆశీర్వదించాడు. మన అమ్మాయి. ఈ అమ్మాయికెప్పుడూ మంచి జరగాలనుకున్న తపన....

ఆ జ్ఞాపకాలు ఏమైపోయాయి? జరిగిన సంఘటనలు చూస్తున్న నా మనసు వెలవెలబోతోంది. ప్రస్తుతం సెక్షన్‌లో వున్నది రామకృష్ణ. నేను! మా ఇద్దరికీ మాటల్లేవు. ఎందుకో? తెలియని పరాయితనం. కాలం గడిచిపోతోంది. ప్రశాంతత కరువైపోయింది.

''రామకృష్ణ గారికి ట్రాన్స్‌ఫర్ అయింది'' ఆవేళ ఆఫీసుకు రాగానే తెలిసింది. ఆరాటం ఆపుకోలేక ఎండి గారి సెక్రటరీ దగ్గరికెళ్లాను.

''నిజమే... వెంటనే రిలీవ్ చేయమన్నారు.'' ఆర్డరు చూపించాడు. మెల్లగా సెక్షన్‌కొచ్చాను. రామకృష్ణ కనిపించాడు. సానుభూతిగా పలకరిద్దామనిపించింది. ఉద్యోగులుగా ఒకచోట కలిసి మెలిసి పనిచేశాం. కానీ ఇటువంటప్పుడు ఎవరికీ ఎవరు ఏం కాదు అనే నిజం మిగిల్చి రామకృష్ణ వెళ్లిపోయాడు. విషయం తెలిసి కూడా స్నేహ ఒక్కమాటైనా మాట్లాడలేదు. మధ్యాహ్నం లంచ్ టైం. క్యాంటిన్ సందడిగా వుంది. బయట చెట్టు కింద ఒక్కడినే కూర్చున్నాను.

''ఇవ్వాళ నా పుట్టినరోజు. లంచ్ ఖర్చంతా నాదే. ఏం కావాలో చెప్పు.'' ఎవరో అనుకుంటూ అటూ ఇటూ చూశాను. దగ్గరలో ఎవరూ కనిపించడం లేదు.

''గుడ్, మెనీ హేపీ రిటర్న్స్'' మాటలు వినిపించిన వైపు చూశాను. క్యాంటిన్ లోపల ఇద్దరు ఆడవాళ్లు మాట్లాడుకుంటున్నారు. ఆసక్తిగా లోపలకి

చూశాను. స్నేహ మరో కొలీగ్ స్వప్న కనిపించారు.

రామకృష్ణ ఇక్కడి నుంచి వెళ్లిపోయాక స్నేహలో చాలా మార్పు వచ్చింది.

"స్నేహా... పుట్టినరోజు మనలో ఎన్నో జ్ఞాపకాలకి ప్రేరణనిస్తుంది కదూ" స్వప్న మాటలకు స్నేహ అవునని తలూపింది.

వాళ్లిద్దరి మాటలు వింటూంటే ఇంకా అక్కడే కూర్చోవాలనిపించింది.

"ఈ పుట్టినరోజు నీలో వున్న జ్ఞాపకం ఏమిటో చెప్పు వినాలని వుంది."

స్నేహ "నా కంటూ ప్రత్యేకంగా చెప్పుకోవలసిన జ్ఞాపకాలు ఏమీ లేవు" అనగానే...

"మనం మరిచిపోకూడని జ్ఞాపకం ఒకటుందిగా చెప్పమంటావా?" స్వప్న మాటల్లో అంతరార్థం ఏదో తొంగి చూస్తున్నట్లు అనిపించింది.

వాళ్లిద్దరి సంభాషణ వినాలని నాలో కుతూహలం.

"సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం నీ పుట్టిన రోజుకి రామకృష్ణగారు నీకో చీర కొనిచ్చి వాళ్లింటి ఆడపడుచువంటూ మనస్ఫూర్తిగా నిన్ను ఆశీర్వదించారు"

"అఫ్‌కోర్స్, ఆ విషయం ప్రత్యేకంగా గుర్తు పెట్టుకోదగ్గది అని నేనెప్పుడూ అనుకోలేదు." ఈ మాట వింటానని, అందులో స్నేహ చెప్పగా వినవలసి వస్తుందని ఊహించని విషయం.

కానీ స్వప్న ఊరుకోలేదు. "స్నేహా ఇవ్వాళ నీ పుట్టినరోజు. నిజం మాట్లాడు. రామకృష్ణ నీ హితవు కోరే ఆప్తుడు.అటువంటి మనిషిని ఎందుకు దూరం చేసుకున్నావు?" ఇదే విషయం నేనూ అడగాలనుకున్నాను. కానీ అవకాశం దొరకలేదు. స్నేహ చెప్పబోయే జవాబేమిటి? ఎదురుచూస్తున్నాను.

"స్వప్నా రామకృష్ణ ఎంతో మంచివాడు. అతని ఆత్మీయత..."

"స్నేహా, నేను అడిగింది అతన్ని ఎందుకు దూరం చేకున్నావని?" విషయం సూటిగా చెప్పమని నిలదీస్తోంది స్నేహని.

విషయం ఏమిటో నాలో కుతూహలం రెట్టింపయింది.

"నేను పోగొట్టుకున్న పుస్తకం తీసుకొని రామకృష్ణ మా ఇంటికి వచ్చాడు. రాత్రి టైములో పైగా ఒక మగవాడు మా ఇంటికి రావడం చూసి చుట్టుపక్కల వారు ఏమనుకుంటారు?" అని చెప్పగానే వింటున్న నాలో ఒక్కసారిగా ఆవేశం.

"అతను మగవాడే, కానీ నిన్ను సొంత చెల్లెలి కన్నా ఎక్కువ... ఇది తెలిసి కూడా నీలో అటువంటి ఆలోచనెందుకొచ్చింది." స్వప్న మాటలు పదునుగా వున్నాయి.

"ఒక మధ్యతరగతి ఆడపిల్లను నేను. నన్ను గురించి ఎవరైనా మరోలా అనుకుంటే నేను తట్టుకోలేను" స్నేహ ఆలోచనను స్వప్న సమర్థించడం లేదు.

"ఎవరో ఏదో అనుకుంటారని నువ్వింత చెయ్యకూడని పనులు చేస్తావా? ఈ విషయంలో అతను ఒప్పుకోలేదని నువ్వు మరో సెక్షన్‌కి మార్చుకున్నావు కానీ... నిష్ఠూరం అతని మీద పడేటట్టు చేసావు. అతని వ్యక్తిత్వాన్ని కించపరిచావు. రామకృష్ణ పెదవి విప్పలేదు. ఈలోగా ఆఫీసులో నీ పలుకుబడి పెరిగింది. అవకాశం చూసుకొని అతన్ని ట్రాన్స్‌ఫర్ చేయించావు." స్వప్న మాటల్లో నిజం నిప్పుకణికల్లా దూకుతోంది.

మౌనంగా తలవంచుకుంది స్నేహ. "నువ్వు ఏదో గొప్ప పని చేశావని అనుకుంటున్నావు. నిన్ను ఎంతో అపురూపంగా చూసుకున్న ఒక మంచి మనిషి నిండు జీవితాన్ని చిన్నాభిన్నం చేశావు. రామకృష్ణకి తలవంపులు తెచ్చి నువ్వు తలదించుకోవడం ఎందుకు? అతన్ని అన్నగా చెప్పుకోలేనందుకు, అతని సోదర ప్రేమకు ఒప్పుకోనందుకు నువ్వు సిగ్గుతో తలదించుకో" అనవలసినవన్నీ అనేసి విసురుగా వెళ్లిపోయింది స్వప్న.

సాటి ఆడపిల్ల మరో సాటి ఆడపిల్ల స్వభావాన్ని అసహ్యించుకుంటున్న క్షణం.

ఆ రోజు స్వప్న వల్ల అసలు విషయం తెలిసింది. అంతే! నేను చేసిన పొరపాటు నాకు తెలిసొచ్చింది. అపార్థం, అందులోనూ ఒక ఆడపిల్ల కల్పించిన అపార్థం. నన్ను తనవాడనుకున్న ఆత్మీయుడిని దూరం చేసుకున్నాను.

ఉత్తరం మడిచి పెట్టాను. తెలివితక్కువతో జరిగిన పొరపాటు. ఎలాగైనా, సరిదిద్దుకోవాలి. ఆరాటంగా రామకృష్ణ కోసం ఎదురుచూస్తున్నాను.

రామకృష్ణ వచ్చాడు. అతను ఆఫీసులో జాయినయ్యాడు. నాకు ఎంతో సంతోషంగా వుంది. ఆప్యాయంగా పలకరించాను. అందుకు ఒకసారి నవ్వాడు. కానీ నిర్లిప్తంగా వుంది. మనసు చిన్నబోయింది. స్వప్నను కలిసి మాట్లాడాను.

"రామకృష్ణగారిని అర్థం చేసుకుంటే ఎవరికైనా ఒక నిజం తెలుస్తుంది." స్వప్న మాటలు అర్థం చేసుకునే ప్రయత్నం.

"ఉద్యోగులుగా మనం ఎన్నో ఒత్తిళ్లతో నలిగిపోతుంటాము. ఫైల్లు రాసి రాసి అలసిపోయిన శరీరానికి బ్రతుకే బరువుగా అనిపిస్తుంది. అటువంటి సందర్భంలో మనసును ఓదార్చేది స్నేహం. అలాంటి స్నేహితుడు రామకృష్ణ."

స్వప్న మాటలు ఎంతో శ్రద్ధగా వింటున్నాను.

"జీవితం చుట్టూ బంధాలు, అనుబంధాలు, స్నేహితులతో అనుభూతులు వుండాలి. అప్పుడే మనం ఉత్సాహంగా బ్రతుకుతాం. మనిషి గుండె స్పందించాలంటే అనుభూతుల దారాలు అల్లుకోవాలి. ఇవన్నీ తెలిసిన మనిషిగా రామకృష్ణ ప్రదర్శించాడు. అతనికి స్వార్థం తెలియదు. అందుకే కల్మషం లేకుండా తోటి వారిని తన వాళ్లుగా అభిమానంతో ఆదరించాడు. ఫలితంగా అతనికేం మిగిలింది? ఒక ఆడపిల్ల లౌక్యంతో వేసిన అపనింద. మనిషిగా అవమానాల పాలయ్యాడు. ఉద్యోగిగా ప్రమోషన్ పోగొట్టుకున్నాడు. మళ్లీ మన మధ్యకి అతనొచ్చాడు. అతను మనసుపోగొట్టుకున్న వ్యక్తి."

ఈ మాటలు అంటున్నప్పుడు స్వప్న కళ్లలో నీళ్లు. స్వప్న మాట్లాడలేని పరిస్థితిలో అక్కడి నుంచి వెళ్లిపోయింది. అదే క్షణంలో నాలో నేటి రామకృష్ణ రూపం కదలాడింది. మనసు విచలితమైపోతోంది.

ప్రస్తుతం అతనొక నిశ్శబ్ద మూర్తి. ★

